క్లుప్తంగా

వృద్ధాశ్రమంలో అన్నదానం



సత్తెనపల్లి: హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఆదరణ అనాథ వృద్ధుల ఆశ్రమంలో అన్నదానం జరిగింది. అమ్ములూరి ఝాన్సీ కనకరాజ్ పుట్టినరోజు సందర్భంగా గురువారం ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఝాన్సీ కనకరాజు మాట్లాడుతూ వృద్ధుల సమక్షంలో జన్మదిన వేడుకలు జరుపుకోవడం, వారికి అన్నదానం చేయడం ఎంతో సంతోషాన్ని కలిగిస్తోందన్నారు. కార్యక్రమంలో హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు, డాక్టర్ అమ్ములూరి కనకరాజు, గంగవరం ప్రసాద్, హెల్ప్ ఫౌండేషన్ సభ్యులు సురేష్, మురారి, గిరితేజ, వృద్ధాశ్రమ నిర్వాహకులు రిషిత తదితరులు పాల్గొన్నారు.

ఫ్రెండ్లీ టూరిజంపై అవగాహన



అమరావతి: ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా, ఆంధ్రప్రదేశ్ టూరిజం అథారిటీ ఆధ్వర్యంలో అమరావతి బౌద్ధ స్తూపం వద్ద హెరిటేజ్ వాక్, ఫ్రెండ్లీ టూరిజంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మేరీమాత హైస్కూల్‌కు చెందిన 70 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అమరావతి చరిత్ర గురించి తెలుసుకుని, ట్రావెల్ ఫర్ లైఫ్ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పర్యాటక శాఖ మేనేజర్ బ్రహ్మానంద రెడ్డి, అసిస్టెంట్ టూరిజం మేనేజర్ చేతన్ జాదర్, అధికారులు నాయుడమ్మ, నాగేంద్ర కుమార్, అమరావతి యూనిట్ మేనేజర్ మణికుమార్, మస్తాన్ వలి, ఆంధ్రప్రదేశ్ టూరిజం అథారిటీ సిబ్బంది పాల్గొన్నారు.

క్రోసూరు ఇన్‌చార్జి తహసీల్దార్‌గా శ్రీనివాసరావు



క్రోసూరు: ఎన్నికల విధుల్లో భాగంగా బదిలీలపై వచ్చిన తహసీల్దార్లను ప్రభుత్వం తిరిగి సొంత జిల్లాలకు బదిలీ చేసింది. ఆ మేరకు క్రోసూరు తహస్దీలార్‌గా పనిచేసిన ఎం.సువర్ణ బదిలీపై ప్రకాశం జిల్లాకు వెళ్లారు. ఇప్పటివరకు డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న కె.శ్రీనివాసరావు క్రోసూరు మండల తహసీల్దారుగా బాధ్యతలు తీసుకున్నారు.

పత్తి సాగు పరిశీలన



క్రోసూరు: క్రోసూరులోని పత్తి సాగును గురువారం క్షేత్రస్థాయిలో ఏవో వేణుగోపాల్ పరిశీలించారు. రైతులకు పలు సూచనలు చేశారు. పత్తి సాగులో రసం పీల్చే పురుగులైన పచ్చదోమ, తెల్లదోమ ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. వీటి నివారణకు తగు మోతాదులో మందులు పిచికారి చేయాలన్నారు. ప్రస్తుతం వర్షా కాలం పంటలలో పలు రకాల కలుపు తీవ్రత ఎక్కువగా ఉంటుందని గుర్తుచేశారు. కలుపు నివారణ చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు కే సందీప్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధిపై కొనసాగుతున్న సర్వే



రాజుపాలెం: మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో కుష్ఠు వ్యాధిపై సర్వే కొనసాగుతోంది. వచ్చే నెల 2వ తేదీ వరకు ఇది కొనసాగనుందని మండల ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యాధికారి డాక్టర్ వెంకట కృష్ణ కుమార్ తెలిపారు. మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల పరిధిలోని ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు చేస్తున్న సర్వేను గురువారం ఆయన పరిశీలించారు. ఏఎన్‌ఎంలు గ్రామాలలోని వారికి మచ్చలు ఏమైనా ఉన్నాయా అని ప్రతి ఇంటికి వెళ్లి నేరుగా పరిశీలిస్తున్నారు. ప్రజలకు వ్యాధిపై తగిన అవగాహన కల్పిస్తున్నారు.

పంచాయతీల్లోనే నీటి నాణ్యత పరీక్షలు

ఇప్పటికే కిట్ల సరఫరా పూర్తి



లింగంగుంట్ల గ్రామంలో నీటిని పరీక్షిస్తున్న ఇంజనీరింగ్ అసిస్టెంట్

పెదకూరపాడు: నేడు ఎక్కడ చూసినా చాలావరకు నీరు కలుషితమవుతోంది. ప్రజలు కుళాయి నీటిని తాగేందుకు కూడా భయపడుతున్నారు. క్యాన్లు, బిందెలతో ఆర్వో ప్లాంట్ల నుంచి నీటిని కొనుగోలు చేస్తున్నారు. ఈ దుస్థితిపై అధికారులు దృష్టి సారించారు. గ్రామ పంచాయతీల్లోనే నీటి నాణ్యత పరీక్షల నిర్వహణకు చర్యలు తీసుకున్నారు. అందుకు అవసరమైన కిట్లు (ఎఫ్‌టీకే) గ్రామీణ నీటి సరఫరా విభాగం (ఆర్‌డబ్ల్యూఎస్) అధికారులకు చేరాయి. వాటిని పంచాయతీలకు సరఫరా చేశారు. వీటి సాయంతో నీటి నాణ్యతను స్థానికంగానే పరిశీలించనున్నారు. తద్వారా తగిన చర్యలు తీసుకుని ప్రజలకు నాణ్యమైన నీటిని సరఫరా చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.

నాణ్యత పరిశీలన ఇలా....

ఒక్క కిట్ విలువ రూ.1293. దీని ద్వారా ఉదజని సూచిక, క్షార గుణ సాంద్రత, సంపూర్ణ జల కాఠిన్యం, క్లోరైడ్, ఫ్లోరైడ్, ఐరన్ తదితరాలు ఎంత శాతం ఉన్నాయో గుర్తించవచ్చు. నీటిలో లవణ లభ్యత, మడ్డి, సల్ఫర్, కాల్షియం శాతం ఎంత ఉందో కూడా పరీక్షలో తెలుస్తుంది. టెక్నికల్ అసిస్టెంట్లతో ఈ విశ్లేషణ చేస్తున్నారు. మొత్తంగా నీటిలో స్వచ్ఛత ఎంత మేర ఉందో ఎప్పటికప్పుడు పంచాయతీల్లోనే తెలుసుకునే వెసులుబాటు కలిగింది.

161 పంచాయతీలకు అందజేత

పెదకూరపాడు, సత్తెనపల్లి నియోజకవర్గాలలో పెదకూరపాడు, అమరావతి, బెల్లంకొండ, క్రోసూరు, అచ్చంపేట, సత్తెనపల్లి, రాజుపాలెం, ముప్పాళ్ల, సత్తెనపల్లి రూరల్, నకరికల్లు మండలాల్లో మొత్తం 161 పంచాయతీలు ఉన్నాయి. వీటి పరిధిలో రక్షిత మంచినీటి పథకాలు ఉన్నప్పటికీ పలు చోట్ల అలంకారప్రాయంగా మిగిలాయి. దీంతో ప్రజలు ప్రత్యామ్నాయ వనరులపై ఆధారపడుతున్నారు. గ్రామీణ నీటి సరఫరా అధికారులు గతంలో పంచాయతీకి ఓ కిట్‌తోపాటు పరీక్షలకు అవసరమైన రసాయనాలు ఇచ్చారు. అవగాహనా రాహిత్యం, సిబ్బంది పట్టించుకోకపోవడంతో తదితర కారణాలతో అవి మూలకు చేరాయి. 2012–13లో ఫిల్టర్ బెడ్లు ఇచ్చారు. ప్రస్తుతం అధికారుల ఆదేశాలతో ఎఫ్‌టీకే కిట్లు పంచాయతీలకు చేరాయి.



పెదకూరపాడు పంచాయతీకి చేరిన నీటి నాణ్యత పరీక్ష కిట్

ఇప్పటికే శిక్షణ పూర్తి



ఇప్పటికే పంచాయతీలకు నీటి నాణ్యత పరీక్ష కిట్లు అందజేశాం. ఇటీవల గ్రామ సచివాలయంలోని ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు, కార్యదర్శులు, సర్పంచ్‌లకు శిక్షణ అందించాం. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎఫ్‌టీకే కిట్ల ద్వారా నీటి నాణ్యత ఎంత మేర ఉందో ఎప్పటికప్పుడు పంచాయతీల్లోనే తెలుసుకోవచ్చు.

– సైకాం కాశిరెడ్డి, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్, పెదకూరపాడు

స్వచ్ఛమైన నీటి సరఫరాకు చర్యలు



ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. నీటిలో స్వచ్ఛత, నాణ్యత ఎంత మేర ఉన్నాయో ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు వీలుగా ఎఫ్‌టీకే కిట్లు గ్రామ పంచాయతీలకు సరఫరా చేసింది. ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది వీటి సాయంతో నీటి నాణ్యతను పరిశీలిస్తారు. పరీక్షలకు ఉపయోగించే కిట్లను ప్రజలు సైతం వినియోగించుకునేలా అందుబాటులో ఉంచుతాం.

– మల్లేశ్వరి, ఎంపీడీవో, పెదకూరపాడు

నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు

- మున్సిపల్ చైర్‌పర్సన్ చల్లంచర్ల లక్ష్మీతులసి
- గార్లపాడు రోడ్డులోని తాగునీటి చెరువు పరిశీలన



సాగర్ జలాలతో నింపుతున్న చెరువును పరిశీలిస్తున్న చల్లంచర్ల లక్ష్మీతులసి తదితరులు

సత్తెనపల్లి: పుర ప్రజలకు భవిష్యత్తులో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా సాగర్ జలాలను చెరువులో నింపేలా అధికారులు చూడాలని మున్సిపల్ చైర్‌పర్సన్ చల్లంచర్ల లక్ష్మీతులసి అన్నారు. పట్టణంలోని తాగునీటి చెరువుకు సాగర్ జలాలు నింపుతున్న నేపథ్యంలో గురువారం చెరువును ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చెరువును పూర్తిస్థాయిలో నింపి భవిష్యత్తులో ఎలాంటి నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. 1,908 మిలియన్ లీటర్ల సామర్థ్యం కలిగిన ఈ చెరువులో ప్రస్తుతం 600 ఎంఎల్ నీరు ఉందని చెప్పారు. ప్రస్తుతం పూర్తి స్థాయిలో చెరువును నింపి ప్రతి రోజు తాగునీటిని విడుదల చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా 40 హెచ్‌పీ మోటార్లు 11 ఏర్పాటు చేశారు. 60 నుంచి 80 ఎంఎల్‌డీ నీటిని ఈ నెల 24వ తేదీ నుంచి నింపుతున్నట్లు అధికారులు తెలిపారు. మరో వారం రోజుల పాటు సాగర్ జలాలు వస్తాయని, ప్రస్తుతం అన్ని మోటార్ల నుంచి నీటిని నింపేందుకు సమృద్ధిగా రావడం లేదనే విషయాన్ని ఆమె దృష్టికి తీసుకొచ్చారు. ఆమెతో పాటు చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, మున్సిపల్ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

వ్యాధులపై అప్రమత్తత అవసరం

సత్తెనపల్లి: వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి బీపీ చంద్రశేఖర్ అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి, జిల్లా మలేరియా శాఖ అధికారి ఆదేశాల మేరకు పట్టణంలో దోమల ద్వారా వ్యాప్తి చెందే డెంగీ, చికెన్ గున్యా తదితర వ్యాధుల నివారణకు చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా మలేరియా సిబ్బంది, పట్టణ మున్సిపల్ సిబ్బంది సహకారంతో బావుల్లో దోమల లార్వాలు తినే గంబూషియా చేపలను గురువారం వదిలారు. ఈ సందర్భంగా బీపీ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. వర్షాకాలంలో నీరు నిల్వ ఉండి దోమల సంతతి వృద్ధి చెందుతుందన్నారు. నీరు నిల్వ లేకుండా చూడాలని, దోమలు కుట్టకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. దోమల లార్వా, ప్యూపా దశలలోని పిల్లలను గంబూషియా చేపలు ఆహారంగా తీసుకొని దోమల సంతతి వృద్ధిని అరికడతాయని పేర్కొన్నారు. మురుగునీరు నిల్వ లేకుండా ప్రజలూ చూడాలన్నారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ ఆరోగ్య పర్యవేక్షకులు బి.రోశయ్య, వై.రాజేష్‌పాల్, కె.వి. నాగమల్లేశ్వరరావు, ఆరోగ్య కార్యకర్తలు ఎస్ఎం హుస్సేన్, ఎంపీ కిరణ్‌బాబు, షేక్ షరీఫ్, తదితరులు పాల్గొన్నారు.



పట్టణంలోని బావిలో గంబూషియా చేపలను వదులుతున్న సిబ్బంది

మిర్చి నారు పనుల్లో రైతులు

పెదకూరపాడు: వర్షాలు తగినంతగా పడటంతో రైతులు వ్యవసాయ పనుల్లో పూర్తిగా నిమగ్నమయ్యారు. మిర్చి పంటకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండటంతో మిరప నారు పోసేందుకు రైతులు సమాయత్తమయ్యారు. మిర్చి పంట సాగుకు పెదకూరపాడు నియోజకవర్గం పెట్టింది పేరు. ప్రతి ఖరీఫ్‌కు ఈ నియోజకవర్గంలో సుమారు 25 వేల హెక్టార్లలో పంట సాగు చేస్తారు. నియోజకవర్గంలోని సాగర్ కుడి కాలువ దిగువన ఆరుతడి పంటగా మిర్చిని అధికంగా పండిస్తున్నారు. గతేడాది మిర్చి నారు కొనుగోలు చేసి నష్టపోయిన రైతులు, ఈ ఏడాది సొంతంగా నారు పోసుకుంటున్నారు. మేలు జాతి నాణ్యమైన విత్తన రకాలను ఎంపిక చేసుకున్నామని రైతులు చెబుతున్నారు. నారు మళ్లు పోసుకునే రైతులు తగిన జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయ, ఉద్యాన శాఖాధికారులు సూచించారు.



పెదకూరపాడులో నారు పనుల్లో కూలీలు

తాగునీరు వృథా చేయొద్దు

సత్తెనపల్లి: తాగునీరు వృథా చేయకుండా వినియోగించుకోవాలని ఇరిగేషన్ సూపరింటెండెంట్ ఇంజినీర్ డి.వరలక్ష్మి చెప్పారు. నాగార్జునసాగర్ కుడి కాలువ నుంచి తాగు అవసరాల నిమిత్తం ఈ నెల 18న 4 టీఎంసీల నీటిని విడుదల చేసిన నేపథ్యంలో పట్టణంలోని గార్లపాడు రోడ్డులోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుకు రాపిడ్ ఫిల్లింగ్ ఏర్పాట్లను గురువారం ఆమె పరిశీలించారు. ఏర్పాట్ల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఆమెతోపాటు ఈఈ ఎం.మురళీధర్, డీ సుందరరావు, వి. దుర్గేష్, పవన్, మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి, మున్సిపల్ డీఈ బి. మధుసూదన్‌రావు, ఏఈలు కె.సాగర్, రాజు తదితరులు ఉన్నారు.

ఆయిల్ పామ్ సాగు లాభదాయకం

బెల్లంకొండ: ఆయిల్ పామ్ సాగు రైతులకు లాభదాయకమని జిల్లా ఉద్యాన శాఖాధికారి సీహెచ్‌వీ రమణారెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని మన్నెసుల్తాన్ పాలెం గ్రామంలో మెగా ప్లాంటేషన్, అవగాహన సదస్సును ఉద్యాన శాఖ, వాల్యూ ఆయిల్ అండ్ గ్యాస్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ సహకారంతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని ఎనిమిది మండలాలను ఆయిల్ పామ్ సాగుకు గుర్తించామన్నారు. దీనిలో భాగంగా మన్నె సుల్తాన్ పాలెంలో మెగా ప్లాంటేషన్ డ్రైవ్‌లో భాగంగా 54 ఎకరాల్లో గురువారం ప్లాంటేషన్ చేశారని తెలిపారు. ఆయిల్ పామ్ సాగు, రాయితీ వివరాలను రైతులకు వివరించారు. వాల్యూ ఆయిల్ అండ్ గ్యాస్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ ఎం.రామ్మోహన్, ప్రతినిధి నవీన్, పిడుగురాళ్ల డివిజన్ ఉద్యాన అధికారి వై.మోహన్ ఏవో కృష్ణయ్య, ఎంపీఈవోలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రమణారెడ్డి

ఆధార్ సవరణల శిబిరం



3వ సచివాలయంలో వివరాలు నమోదు చేస్తున్న సురేష్

సత్తెనపల్లి: పట్టణంలోని అచ్చంపేట రోడ్‌లో ఉన్న 3వ సచివాలయంలో ఆధార్ సవరణల శిబిరం గురువారం నిర్వహించారు. పలువురు పేరులో తప్పులు సవరించుకోవడం, ఫోన్ నెంబరు లింకింగ్ తదితర మార్పుచేర్పులు చేయించుకున్నారు. ఎడ్యుకేషనల్ అండ్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీ సురేష్ తదితరులు శిబిరంలో పాల్గొన్నారు. ఈ నెల 26న క్రిస్టియన్‌పేట (5వ సచివాలయం)లో శిబిరం ఉంటుందని మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి గురువారం తెలిపారు.



దొడ్లేరు-1 సచివాలయంలో శిబిరంలో దరఖాస్తుదారులు

దొడ్లేరులో కొనసాతున్న శిబిరం...

దొడ్లేరు(క్రోసూరు): మండలంలోని దొడ్లేరు గ్రామ సచివాలయం–1 లో గురువారం ఆధార్ సవరణల శిబిరం కొనసాగింది. మండల ప్రజలు ఆధార్ శిబిరాన్ని సద్వినియోగ పరుచుకోవాలని పంచాయతీ కార్యదర్శి కె.సాంబిరెడ్డి, కె.వెంకయ్యలు కోరారు. శుక్రవారం కూడా దొడ్లేరు–1లో శిబిరం ఉంటుందని, శనివారం అనంతవరం సచివాలయంలో ఏర్పాటు చేస్తామని తెలిపారు.

ప్రజలకు అందుబాటులో పంచాయతీ కార్యదర్శులు

పేర్లు, ఫోన్ నెంబర్లు ప్రకటించిన ఎంపీడీవో

క్రోసూరు: క్రోసూరు మండలంలోని 15 సచివాలయాల పరిధిలో పనిచేస్తున్న 21 మంది పంచాయతీ కార్యదర్శులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటారని ఎంపీడీవో కేవీ రమణ గురువారం తెలిపారు. ఈ మేరకు వారి పేర్లు, ఫోన్ నెంబర్లు ప్రజలకు అందుబాటులో ఉంచేందుకు ఆయన వెల్లడించారు. వివరాలు ఇవీ... క్రోసూరు –1 పంచాయతీ కార్యదర్శి ఎ.ఆదినారాయణ (ఫోను నెంబరు: 98660 18932) క్రోసూరు–2కు షేక్ ఖాజావలి (89772 73701) క్రోసూరు–3కి షేక్ రమీజ్ (81219 89789), బయ్యవరం– వై.శ్రీనివాసరావు (94407 11768), ఉయ్యందన–ఎ.ఉమాశంకర్ (90142 81260), పీసపాడు– కె.సుధారమణి (63058 90550), నాగవరం, అందుకూరు పంచాయతీల కార్యదర్శి–టి.రత్నరాజు (89191 34113), బాలెమర్రు – ఎం.హరికృష్ణ (99488 47074), ఊటుకూరు – ఎస్‌బీపీ షేక్ ఖాజావలి (95020 84507), గుడిపాడు– షేక్ మహ్మద్ జాన్ (98858 63067), దొడ్లేరు, పెరికపాడు పంచాయతీల కార్యదర్శి – వెంకయ్య (76758 06706), దొడ్లేరు 2 – టి.సాంబిరెడ్డి (83414 34546), ఆవులవారిపాలెం– టి.రవికుమార్ (95502 18132), హసనాబాద్ – సీహెచ్ విజయలక్ష్మి (79892 14448), అనంతవరం – షేక్ షాహెదా (89789 74202), 88త్యాళ్లూరు – పీవీ రమేష్ (73823 83673), విప్పర్ల – జెర్రిపోతు ప్రకాశ్ (79896 74099).

విద్యార్థుల అభివృద్ధికి చర్యలు

సత్తెనపల్లి: విద్యార్థుల్లో విజ్ఞానం పెంచి అన్నివిధాలా అభివృద్ధి చెందేలా వారం రోజులపాటు శిక్ష సప్తాహ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జే మాధవీలత అన్నారు. పట్టణంలోని ఈ పాఠశాలలో గురువారం శిక్ష సప్తాహ్ కింద సాంస్కృతిక వేడుకలు నిర్వహించారు. విద్యార్థుల్లో భిన్నత్వంలో ఏకత్వం భావాన్ని పెంచేలా ఇవి సాగాయి. ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు, ఫ్యాన్సీ డ్రెస్, పాటలు, నృత్య ప్రదర్శన, నాటికల పోటీలు వంటివి నిర్వహించారు. విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.



నాటిక ప్రదర్శనలో బాలికలు

సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలి

దమ్మాలపాడు(ముప్పాళ్ళ): అధిక వర్షపాతంతో నేలలోని తేమ నుంచి పంటలను కాపాడుకునేందుకు సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలని మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ చెప్పారు. మండలంలోని దమ్మాలపాడు గ్రామంలో పత్తి, మిరప నారుమడులను గురువారం ఆమె పరిశీలించారు. పత్తి చేలను పరిశీలించి పంటపై వీఏఎం అనే శిలీంధ్రాన్ని ఉపయోగించాలని సూచించారు. ఇది నేల నిర్మాణం, మొక్క పర్యావరణ ఒత్తిడికి లోనవ్వకుండా నిరోధకశక్తిని అందించడానికి ఉపయోగ పడుతుందన్నారు. మిరప నారుమళ్లలో నారుకుళ్లు తెగులు రాకుండా ట్రైకోడెర్మా లేదా సూడోమోనాస్‌లను మడి తయారీ సమయంలో ఉపయోగించాలని సూచించారు. మిరప దుక్కిలో కూడా ట్రైకోడెర్మా, సూడోమోనాస్‌ల వృద్ధి చేసిన మిశ్రమాన్ని చల్లుకోవాలన్నారు. రైతులు ట్రైకోడెర్మా విరిడీ జీవ శిలీంధ్ర నాశినితో 100 గ్రాములు విత్తనశుద్ధి చేసుకోవాలని సూచించారు. ముందుగా వర్షాలకు పొలంలో ఉన్న నీటిని బయటకు పంపించాలన్నారు. తేమ ఆరిన తర్వాత గొర్రు, గుంటకలు నడుపుకొని కలుపు యాజమాన్యం చేసుకోవాలన్నారు. తేమ ఆరిన తర్వాత ఎకరాకు 50 కేజీల యూరియా, 50 కేజీల డీఏపీ, పొటాష్ 25 కేజీలు పొలంలో వెద పెట్టాలని సూచించారు. ఎక్కడైనా ఉరక వేసినట్లుగా ఉంటే పైపాటుగా రెండు కిలోల యూరియా, కేజీ డీఏపీని 200 లీటర్ల నీటిలో కలిపి పైరుపై పిచికారి చేసుకోవాలని సూచించారు. ఆమెతో పాటుగా ఉద్యాన సహాయకులు వి.వెంకటేశ్వర్లు, రైతులు ఉన్నారు.



దమ్మాలపాడులో మిరప నారుమడి వద్ద రైతుకు సూచనలు చేస్తున్న ఏఓ అరుణ

కౌలు రైతులకు లబ్ధి కలిగేలా చర్యలు

నకరికల్లు: కౌలు రైతులకు పంట సాగుదారు కార్డులు మంజూరు చేసి రుణాలు ఇప్పించాలని రైతు సేవా కేంద్రాల్లో అవగాహనా సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ డి.జయమణి అన్నారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ (డీబీఆర్‌సీ) ఆధ్వర్యంలో గురువారం ఈ మేరకు చేపట్టిన ఆటో ప్రచారోద్యమ ర్యాలీని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా సెంటర్ గుంటూరు, పల్నాడు జిల్లాల రీజనల్ కో ఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప మాట్లాడుతూ నకరికల్లు నుంచి ప్రచారం ప్రారంభించి చల్లగుండ్ల, చీమలమర్రి, కండ్లకుంట, చాగల్లు గ్రామాల్లో కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో డీబీఆర్‌సీ జిల్లా మహిళా కో ఆర్డినేటర్ మేడే రమణ, ఏరియా కో ఆర్డినేటర్ గడ్డిపర్తి కోటిరత్నం, ఏపీఓ గోపీకృష్ణ, ఆయా శాఖల సిబ్బంది పాల్గొన్నారు.



నకరికల్లు తహసీల్దార్ కార్యాలయం నుంచి ఆటో ప్రచారోద్యమ ప్రారంభ దృశ్యం

దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి

పెదకూరపాడు: వైఎస్సార్ సీపీ నేత ఈదా సాంబిరెడ్డిపై విచక్షణరహితంగా దాడి చేసిన దుండగులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య, జెడ్పీటీసీ సభ్యురాలు కంకణాల స్వర్ణకుమారి, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి కంకణాల శివాజీలు డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఇలాంటి దాడులకు అంతులేకుండా పోయిందన్నారు. మంచితనం కలిగి, మానవతావాదిగా పేరు పొందిన సాంబిరెడ్డిపై కాపు కాసి దాడి చేయడం దారుణమని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి దాడులు సరికాదన్నారు. దాడులు పునరావృతం కాకుండా పోలీసులు కఠినంగా వ్యవహరించాలని కోరారు.

అంగన్‌వాడీ సిబ్బందిపై వేధింపులు దారుణం

అమరావతి: మండలంలో అంగన్‌వాడీ సిబ్బంది, హెల్పర్లపై అధికారుల ద్వారా అధికార కూటమి నాయకులు ఒత్తిడి చేసి రాజీనామాలు చేయించే ప్రయత్నాలు మానుకోవాలని సీఐటీయూ మండల కార్యదర్శి బి.సూరిబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్, స్కీం వర్కర్లు ఎన్నో సంవత్సరాల నుంచి ప్రభుత్వాలు ఇచ్చే గౌరవ వేతనంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నారని పేర్కొన్నారు. అలాంటి వారిపై అధికార పార్టీ గ్రామ, మండల నాయకులు వేధింపులకు పాల్పడటం దారుణమని తెలిపారు.

హెల్మెట్ రహిత ప్రయాణం ప్రమాదకరం

ముప్పాళ్ళ: అతివేగం ప్రమాదకరమని, హెల్మెట్ లేకుండా ద్విచక్రవాహనాలు నడపడం అత్యంత ప్రమాదకరమని ప్యానల్ న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు అన్నారు. రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు సత్తెనపల్లి మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి వెంకట నాగ శ్రీనివాసరావు సూచనల మేరకు మోటారు వాహనాల చట్టంపై ముప్పాళ్ళలోని పీర్లచావిడి సెంటర్‌లో గురువారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. సదస్సులో శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ప్రతి వాహనదారుడు జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని, అలా ఇస్తే తల్లిదండ్రులకు కూడా శిక్షలు పడే విధంగా చట్టాలు ఉన్నాయన్నారు. ఏఎస్సై నవరాజ్ మాట్లాడుతూ.. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడపటం నేరమన్నారు. వాహనాలకు ఇన్సూరెన్స్ అవసరమని చెప్పారు. కార్యక్రమంలో పారా లీగల్ వలంటీర్లు షేక్ సుభాని, షేక్ ఖాజావలి, షేక్ ముబారక్, కోర్టు కానిస్టేబుల్ షేక్ జలీల్, స్థానికులు పాల్గొన్నారు.



నర్సరీలకు ప్రభుత్వ గుర్తింపు తప్పనిసరి



రాజుపాలెం: నర్సరీ యజమానులు తప్పనిసరిగా ప్రభుత్వ గుర్తింపు కలిగి ఉండాలని ఉద్యాన శాఖాధికారి డి.నవీన్ తెలిపారు. మండల కేంద్రంలోని రాజుపాలెం సమీపంలో నర్సరీలను వ్యవసాయ అధికారి వెంకటనర్సయ్యతో కలిసి గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా నర్సరీ యజమానులతో మాట్లాడుతూ రైతులు మిరప విత్తనాలు తెచ్చి నాటమన్నప్పుడు బిల్లు ఉంటేనే నాటాలని తెలిపారు. ప్రతి నర్సరీ యజమాని రిజిస్టర్‌లు మెయింటెన్ చేయాలన్నారు. పురుగు మందులు, పోషకాలను నమోదు చేయాలని సూచించారు. పరిశీలించిన నర్సరీలో మిరప నారు మొలక శాతాన్ని గుర్తించారు. రైతులకు ఇచ్చే నారులో తేడాలు ఉంటే నర్సరీ యజమానులే బాధ్యత వహించాలని హెచ్చరించారు.

లబ్ధిదారులకు ఉపకరణాల పంపిణీ

బొల్లవరం(ముప్పాళ్ళ): మండలంలోని బొల్లవరం గ్రామంలో నేషనల్ హెల్త్ మిషన్ ప్రోగ్రాంలో భాగంగా లబ్ధిదారులకు కిట్లను గురువారం అందించారు. అంగవైకల్యం, నడుమునొప్పి ఉండి నడవలేని వారికి, మెడనొప్పి ఉన్న 32 మందికి నేషనల్ ప్రోగ్రాం ఫర్ ప్రివెన్సీస్ అండ్ కంట్రోల్ ఆఫ్ ఫ్లోరోసిస్‌లో భాగంగా స్టిక్స్, ముగ్గురికి మెడ బెల్టులు, ఆరుగురికి లంబార్ బెల్ట్స్ అందించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పీ కోటిరెడ్డి, వీఆర్వో సంజీవరావు, సీహెచ్‌ఓ పి. కమల, ఏఎన్‌ఎం టి. అనూరాధ, బి.వెంకటరెడ్డి పాల్గొన్నారు.



సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
(సత్తెనపల్లి, పెదకూరపాడు)
99516 02950
Office mail : sakshigntadvt@gmail.com